
సాక్షి పల్నాడు

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



యోగాలో శిక్షణ

తాడికొండ: మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో శనివారం యోగాలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరామారావు మాట్లాడారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 577.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,086 క్యూసెక్కులు వదిలారు.

తమలపాకులతో అలంకరణ



తెనాలి: మారీసుపేటలోని బాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో వీరాంజనేయస్వామికి తమలపాకులతో అలంకరణ చేశారు. శనివారం హారతి, మంత్ర పుష్పం సమర్పించారు.

న్యూస్‌రీల్

సబ్‌జైలు సందర్శన



సత్తెనపల్లి: సత్తెనపల్లి సబ్ జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ పార్థసారథి, గుంటూరు జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) లీలావతి శనివారం సందర్శించారు. సబ్ జైలులోని నిందితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించారు. సరుకుల నాణ్యతను, ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్, ప్యానల్ న్యాయవాది బి.ఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్'



నరసరావుపేట రూరల్: పెద్దచెరువులోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కార్యాలయం ప్రాంగణంలోని డివిజన్ కార్యాలయం, ఏరియా పశువైద్యశాల, పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రాంగణాన్ని శుభ్రపరిచి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, డీడీఏ డాక్టర్ సి.కోటిరత్నం, ఏడీఏ డాక్టర్ కె.కళావతి, ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

స్కేటర్ జెస్సీరాజ్‌కు బాల పురస్కార్



మంగళగిరి: పట్టణానికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ జెస్సీరాజ్‌ను ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ –2025 వరించింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డు అందుకోనున్నారు. ఏటా 25 మంది బాలలకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ఇస్తుంటుంది. వచ్చే ఏడాది జాబితాను ఇటీవల ప్రకటించింది. ఈ సందర్భంగా జెస్సీరాజ్‌ను పలువురు అభినందించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1616 క్యూసెక్కుల విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 68, తూర్పు కెనాల్‌కు 63, పశ్చిమ కెనాల్‌కు 56, నిజాంపట్నం కాలువకు 151, కొమ్మమూరు కాలువకు 1310 క్యూసెక్కులు విడుదల చేశారు.

వస్తువుల కొనుగోళ్లపై అవగాహన



నరసరావుపేట: వస్తువుల కొనుగోళ్లలో అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని, విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచే దీనిపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. జేసీ గనోరే అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లీగల్ మెట్రాలజి శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ అల్లురయ్య మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తూనికలు, కొలతల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని డెమో రూపంలో చూపించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ పిల్లి యఘ్నునారాయణ, డీసీపీసీ మెంబర్ కె.మస్తాన్‌రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి బి.నారదముని వివిధ వస్తువుల కొనుగోలు గురించి వివరించారు. కలెక్టర్ చేతుల మీదుగా విజేతలకు మొదటి బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతి రూ.1500లతో పాటు ప్రశంశా పత్రాలు, మెమెంటోలను అందజేశారు. డీఈఓ చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



గుంటూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



నారాయణపురంలో దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కాసు మహేష్

మార్మోగిన జగన్నినాదం

- అంబరమంటిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సంబరాలు
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- కేక్ కటింగ్స్, క్షీరాభిషేకాలు
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల సేవా కార్యక్రమాలు

ఊరూవాడా ఉత్సాహం

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం అంబరాన్నంటాయి. ఊరూవాడా ఉత్సాహంతో ఉప్పొంగింది. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేట రామిరెడ్డిపేటలోని పాతసమితి కార్యాలయ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. రొంపిచర్ల మండలంలోని విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

- గురజాల నియోజకవర్గం పిడుగురాళ్లలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేశారు. పేదలకు అన్నదానం నిర్వహించారు.
- మాచర్ల నియోజకవర్గంలోని మాచర్ల, దుర్గి, కారెంపూడి, నాగార్జునసాగర్, రెంటచింతల మండలాల్లో నాయకులు కేక్‌లు కట్‌చేసి పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలోని లగడపాడు, క్రోసూరు మండలాల్లో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఎస్సీ కాలనీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద కాలనీ వాసులు కేకులు కట్‌చేశారు.
- వినుకొండ నియోజకవర్గంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, గంధం బాలిరెడ్డి, అమ్మిరెడ్డి అంజిరెడ్డి, ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డిల నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు పీఎస్ ఖాన్ నేతృత్వంలో కేక్ కట్‌చేసి అన్నదానం నిర్వహించారు.
- సత్తెనపల్లి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పరివర్తన మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఏరియా వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఆదరణ అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నసంతర్పణ చేశారు. ముప్పాళ రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోనూ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, మండల నాయకులు, పార్టీ బాధ్యులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేసిన మాజీ మంత్రి విడదల రజిని

సుపరిపాలకుడు జగన్

మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: సమసమాజమే లక్ష్యంగా సుపరిపాలన అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని కొనియాడారు. స్థానిక ఎన్ఆర్‌టీ రోడ్డులోని మాజీ మంత్రి రజిని నివాసంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమం అనే మాట వినగానే వెంటనే గుర్తుకు వచ్చేది వైఎస్ జగన్ అని చెప్పారు. వైఎస్ జగన్ తన పాలనలో విద్య, వైద్య రంగాల్లో వినూత్న సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం వైఎస్ జగన్ విజన్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలనను చూసిన ప్రజలు ప్రస్తుతం కూటమి సర్కారు దుష్ట పాలనను గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం బాగుండాలన్నా, పేదవాడి మోములో మళ్లీ సంతోషం కనిపించాలన్నా తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో ర్యాలీగా ప్రభుత్వాస్పత్రికి వెళ్లి రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

జన హృదయ విజేత జగన్

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రజల విశ్వాసాన్ని పొంది వారి హృదయాలు గెలిచిన ఏకైక రాజకీయ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం గోపిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత పట్టణంలోని రామిరెడ్డిపేట పాత సమితి కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం లింగంగుంట్లలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కేకు కట్‌చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రకాష్‌నగర్‌లోని జాయ్ హోం హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ కార్యాలయానికి వెళ్లి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ నాయకులంతా కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పనిచేయాలని కోరారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు అద్భుతమని కొనియాడారు. ఇంటి ముందుకు పరిపాలనను జగన్ తీసుకొచ్చారని వివరించారు. వైఎస్ జగన్‌ను తిరిగి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, షేక్ ఖాజావలి మాస్టారు, ముదిరాజు, స్వచ్ఛ ఆంధ్ర, గిరిజన, మాదిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతపాల్, పొలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, రొంపిచర్ల మండల పార్టీ కన్వీనర్ కురుకుంట్ల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ రెహమాన్, మాగులూరి రమణారెడ్డి, బత్తుల పద్మలత, షేక్ కరిముల్లా, పచ్చవ రవి, డి.రమేష్, గంటనపాటి గాబ్రియల్, పి.వెంకటరెడ్డి, అచ్చి శివకోటి, హాలీవుడ్ రఘు, సానికొమ్ము సుబ్బారెడ్డి, వద్దుల సుబ్బారెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాదర్‌బాష, సయ్యద్‌ఖాదరబాష, పంగులూరి విజయకుమార్, జి.అచ్యుతరావు, కామిరెడ్డి నాగిరెడ్డి, ఏరువ కోటిరెడ్డి పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితాన్ని బలి చేసుకోవద్దు

డీజీపీ ద్వారకా తిరుమలరావు



ప్రసంగిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఏఎన్‌యూ: వ్యసనాలకు లోనై జీవితాలు బలి చేసుకోవద్దని విద్యార్థులకు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం నిర్వహించిన ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు డీజీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ.. నేడు యువతను పట్టిపీడిస్తున్న సైబర్ క్రైమ్, డ్రగ్స్ ముప్పు వంటి సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలిసీ తెలియని వయసులో విద్యార్థులు, యువత చెడు వ్యసనాల వైపు పయనిస్తూ ఉండటం బాధాకరమన్నారు. తమతోపాటు సమాజాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు ప్రసంగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతికత అంశాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలన్నారు. నేడు సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, సమస్యలకు విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అన్వేషించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతోందని, దానిలో ఉన్న అపార ఉపాధి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉద్యోగంతోనే సరిపెట్టుకోకుండా సమాజ స్థితిగతులు మార్చే వారిగా విద్యార్థులు ఎదగాలన్నారు. విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ లేదని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన స్కిల్ ఓరియంటెడ్ కార్యక్రమాలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ తరగతులను, ఉద్యోగాలు పొందేందుకు క్యాంపస్ డ్రైవ్‌లను నిరంతరం చేపట్టనున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కే రత్న షీలామణి మాట్లాడుతూ సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులకు సమయపాలన, క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి ప్రసంగించారు. పలువురు పరిశోధకులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కాంతారావు ఏకగ్రీవ ఎన్నిక

- వైస్ చైర్మన్‌గా చక్రపాణి ఏకగ్రీవం
- ధ్రువీకరణ పత్రాలు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు




చైర్మన్‌గా ఎంపికైన కాంతారావుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లా సాగునీటి యాజమాన్య కమిటీలకు సంబంధించిన నాగార్జున సాగర్ కుడికాలువ ప్రాజెక్ట్ కమిటీ (పీసీ) చైర్మన్, వైస్‌చైర్మన్‌ల పదవులకు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హాజరైన సభ్యులు ప్రాజెక్ట్ కమిటీకి చైర్మన్‌గా కులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్‌గా ఉప్పలపాటి చక్రపాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ పి.అరుణ్‌బాబు వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎన్నికను ఎన్ఎస్పీ ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమోహన్ పర్యవేక్షించారు. చైర్మన్ కాంతారావు మాట్లాడుతూ కాలువలను బాగుచేసి చివరి భూములకు నీరందించేందుకు కృషిచేస్తానని చెప్పారు. వైస్ చైర్మన్ చక్రపాణి మాట్లాడుతూ తాను 1995 నుంచి నీటిసంఘ అధ్యక్షుడిగా ఎన్నికవుతూ వస్తున్నానని చెప్పారు. గత కమిటీలో తాను డైరెక్టర్‌గా ఉన్నానని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాలులో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. దీనికి ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట, గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పార్టీ నాయకులు నల్లపాటి రాము, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రీస్తు జీవితం మానవాళికి ఓ సందేశం

కలెక్టర్ అరుణ్ బాబు



క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే చదలవాడ, జేసీ గనోరే

నరసరావుపేట: ఏసుక్రీస్తు ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆకాంక్షించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో క్రిస్మస్ పర్వదినం సమీపిస్తున్న సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 'హై–టీ' కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి పాల్గొన్నారు. అందరూ కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని చెప్పారు. క్రీస్తు జీవితం మానవాళికి ఓ సందేశమని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల పైలాన్ సమీపంలో శుక్రవారం రాత్రి భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. కొండ సమీపంలో నుంచి వచ్చిన కొండచిలువ సుమారు 8.1/2 అడుగుల పొడవున ఉంది. స్థానికులు దీన్ని గుర్తించి చాకచక్యంగా పట్టుకొని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న అధికారులు కొండచిలువను తీసుకుపోయారు. ఘటన జరిగిన స్థలానికి మేదరమెట్ల ఎస్ఐ రఫీ వచ్చి పరిశీలించారు.

ఎస్సీ హాస్టల్‌లో పాపకు జన్మనిచ్చిన విద్యార్థిని

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరులోని సాంఘిక సంక్షేమ వసతిగృహం(పరివర్తన భవన్)లో ఓ విద్యార్థిని శుక్రవారం రాత్రి పాపకు జన్మనిచ్చింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని గుంటూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీ ఫార్మసీ చదువుతూ కలెక్టరేట్ బంగ్లా రోడ్డులోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటోంది. శుక్రవారం రాత్రి విద్యార్థిని తన స్నేహితురాలి సాయంతో పాపకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది వెంటనే తల్లి, బిడ్డను జీజీహెచ్‌కు తరలించారు. హాస్టల్‌లో ఇంత జరుగుతున్నా వార్డెన్‌కు ఏమీ తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఘటనపై ఏఎస్‌డబ్ల్యూవో చెంచులక్ష్మిని వివరణ కోరగా వార్డెన్‌కి విద్యార్థిని గర్భిణి అన్న విషయం తెలియదని చెప్పారు.

పాఠశాలల అభివృద్ధిలో సీఆర్పీలది కీలకపాత్ర

డీఈఓ చంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: విద్యారంగ అభివృద్ధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ)లు కీలకపాత్ర పోషించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో శనివారం జిల్లా పరిధిలోని సీఆర్‌పీ, ఎంఐఎస్ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, పాఠశాలల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులకు సీఆర్‌పీలు తమ సహాయ సహకారాలను అందిస్తూ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అపార్ సవరణలు, ఆధార్ సవరణలలో ప్రధానోపాధ్యాయులకు సీఆర్‌పీలు పూర్తి స్థాయిలో సహరించాలని కోరారు. బడి బయట ఉన్న బడిఈడు పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సీఆర్‌పీలు తమ క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పాఠశాలల్లోని క్రీడా సామగ్రి సంబంధిత పాఠశాలలకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు టి.రవికాంత్, మల్లిఖార్జునరావు, వై.హనుమంతరావు, మొహిద్దీన్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఘనత వైఎస్ జగన్‌దే



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆర్టీసీ ఉద్యోగులు శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో కేకును కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తాను అధికారంలో ఉండగా ఇచ్చిన మాట తప్పకుండా ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసిన మడమ తిప్పని నాయకుడని నిరూపించుకున్నాడని కొనియాడారు. యూనియన్ అధ్యక్షులు చిన్నా, జాయింట్ సెక్రెటరీ లెనిన్‌బాబు, రిటైర్డ్ ఉద్యోగులు ప్రసాదరెడ్డి, చింతగుంట మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఫ్లెక్సీలను చించిన పోలీసులు

వినుకొండ(నూజెండ్ల): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా పార్టీ అభిమానులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను పోలీసులు తొలగించారు. ఈపూరు మండలంలోని కొచ్చర్ల ఎస్సీ కాలనీలో అభిమానులు ఫ్లెక్సీలు సొంత ఇళ్లకు కట్టుకున్నా ఈపూరు స్టేషన్ రైటర్ వాటిని చించి అక్కడ నుంచి తీసుకెళ్లారు. ఇదేమని పార్టీ అభిమానులు ప్రశ్నించగా మీకు ఎవడు పర్మిషన్ ఇచ్చాడురా అంటూ బెదిరించాడు. మీపై స్టేషన్‌లో కంప్లైంట్ ఉందంటూ ఫ్లెక్సీలను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లారు. అలాగే వినుకొండ రూరల్ మండలం పిట్టంబండ గ్రామంలో కూడా అభిమానులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగించి ఫ్లెక్సీలను కట్టిన వారిని స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పశు వ్యాధుల నివారణకు పటిష్ట ప్రణాళిక

పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు

నరసరావుపేట రూరల్: పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు పటిష్ట ప్రణాళిక అమలు చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారి కె.కాంతారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 త్రైమాసికంలో పశువ్యాధి టీకాలపై కాలమాన పట్టికను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దీనిని అనుసరించి జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఒకే సారి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్‌లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే గేదెలు, ఆవులకు గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని వివరించారు. జనవరిలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఫిబ్రవరిలో కోళ్లు, బాతులకు, కొక్కెర తెగులు, కోళ్లలో మశూచి వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందిస్తారని వివరించారు. ఫిబ్రవరిలో 4 నుంచి 8 నెలల వయస్సు గల గేదె, ఆవు జాతి పెయ్య దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారని పేర్కొన్నారు. మార్చి నెలలో గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని మండల ప్రాంతీయ పశువైద్యశాలలకు, పశువైద్య కేంద్రాలకు, గ్రామీణ పశువైద్య శాలలకు రూ.1,30,58,200 విలువైన మందులను పంపిణీ చేసినట్టు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులు జాతి నిర్మాణ సారథులు

ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



విశ్రాంత ఉద్యోగి బొడ్డు రామారావును సత్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, ప్రభుదాసు తదితరులు

సత్తెనపల్లి: విశ్రాంత ఉద్యోగులు జాతి నిర్మాణ సారథులని, వారి అనుభవం అపారమైనదని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ జాతీయ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఎన్జీవో హోం ఆవరణలో సత్తెనపల్లి యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బొడ్డు రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కొరకు విశ్రాంత ఉద్యోగులందరూ సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు మాట్లాడుతూ 1982 డిసెంబర్ 17న జస్టిస్ చంద్రచూడు నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పు వల్ల నేడు విశ్రాంత ఉద్యోగులు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నార న్నారు. విశ్రాంత ఉద్యోగుల సూచనలు ఆచరిస్తే ఏ దేశమైనా అభివృద్ధి పథంలో రాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన ఏడుగురు విశ్రాంత ఉద్యోగుల దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సత్తెనపల్లి యూనిట్ నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, కోశాధికారి కైపు రంగారెడ్డి, సంఘ నాయకులు పోతులూరయ్య, ప్రభుదాసు, రామకోటయ్య, వెంకటాద్రి, మురహరి, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జక్కుల

ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడిగా రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు జక్కుల లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఏపీ ఎన్జీవో హోం ఆవరణలో శనివారం నిర్వహించిన పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ సర్వసభ్య సమావేశంలో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు కేబీఆర్‌జే ప్రసాద్, కోశాధికారిగా రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కైపు రంగారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 20 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ ప్రభుదాసు, పల్నాడు జిల్లా పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షుడు మానవ సుబ్బారావు అభినందనలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

స్థలం విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ

నకరికల్లు: స్థలం విషయమై చోటుచేసుకున్న వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. మండలంలోని గుండ్లపల్లిలో శనివారం జరిగింది. వివరాలు... గ్రామానికి చెందిన షేక్ ఖాజా, తన తండ్రి కొంతస్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ ద్వారా హక్కులు పొందారు. సదరు స్థలం గ్రామకంఠంలో ఉందని కొందరు బెదిరింపులకు దిగారు. దీంతో హైకోర్టు ద్వారా అనుమతులు పొంది గతేడాది కంచె వేసుకున్నాడురు. ప్రస్తుతం సదరు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండగా కొందరు ఘర్షణకు దిగారు. కోర్టు అనుమతులు ఉన్నా స్థలం కబ్జా చేశామని టీడీపీ నాయకులు అధికారబలంతో తనపై బెదిరింపులకు, దాడులకు పాల్పడుతున్నారని బాధితుడు ఆరోపిస్తున్నారు. కాగా సదరు స్థలం గ్రామకంఠానికి సంబంధించినదేనని మరో వర్గం వాదన. ఇరువర్గాల భిన్నమైన వాదనల నేపథ్యంలో ఘర్షణ చోటు చేసుకోవడంతో ఏఎస్ఐ కోటేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపడంతో ప్రశాంత చోటుచేసుకుంది. కోర్టు నిర్ణయం మేరకు నడుచుకోవాలని గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.



ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

మద్యం మత్తులో యువకుల వీరంగం

కేబుల్ ఆపరేటర్‌పై దాడి



గాయపడ్డ అంకిరెడ్డి

నరసరావుపేటటౌన్: మద్యం మత్తులో నలుగురు యువకులు కేబుల్ ఆపరేటర్‌పై దాడికి పాల్పడిన ఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. లింగంగుంట్ల రాజుపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మారెడ్డి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మొదటి రైల్వే గేటు వద్ద రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన యువకులు ఢీకొట్టారు. దీనిపై బ్రహ్మారెడ్డికి ఆ యువకులకు మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. విషయాన్ని బ్రహ్మారెడ్డి, అతని సోదరుడైన కేబుల్ ఆపరేటర్ అంకిరెడ్డికి ఫోన్‌లో తెలియపరిచాడు. అంకిరెడ్డి అతని సోదరి ధనలక్ష్మి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. గొడవ పడుతున్న యువకులను సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో నలుగురు యువకులు అంకిరెడ్డి, ధనలక్ష్మిలపై దాడికి పాల్పడ్డారు. ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడ్డ నలుగురిలో ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలపై పోలీసుల అత్యుత్సాహం

తాడికొండ: వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా తాడికొండలో ఏర్పాటు చేసిన మైకులను తొలగించాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. కార్యకర్తలు, నాయకులు చిన్నపాటి మైకులు ఏర్పాటు చేసి శనివారం వేడుకలు నిర్వహించుకుంటున్నారు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయంటూ ఆంక్షల పేరుతో పోలీసులు ఆ మైకులు తొలగించారు. గతంలో ఎన్నడూ లేనంతగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ జన్మదిన వేడుకల విషయంలో పోలీసులు వ్యవహరించడంపై స్థానికులు మండిపడ్డారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి లాక్రోస్ పోటీలు



లాక్రోస్ గేమ్ ఆడుతున్న క్రీడాకారులు

చీరాల: విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ ప్రావీణ్యాన్ని సాధించాలని తద్వారా మానసిక, శారీరక దృఢత్వం సాధ్యమని బాపట్ల జిల్లా ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. చీరాల–కారంచేడు రోడ్డులోని ఫ్రైడ్ ఇంటర్నేషనల్ పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులు పాటు జరగనున్న రాష్ట్రస్థాయి లాక్రోస్ గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ లాక్రోస్ గేమ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లాక్రోస్‌లాంటి క్రీడలు ఆడటం ద్వారా క్రీడల్లో ఏ విధంగా అయితే గెలుపు ఓటములు ఉంటాయో, అదే తరహాలో జీవితంలో వచ్చే ఒడిదుడుకులు, ఒత్తిడిని విద్యార్థులు సమర్థవంతంగా ఎదుర్కొంటారన్నారు. స్కూల్ కరస్పాండెంట్, లాక్రోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడుతూ ఒలంపిక్ అర్హత సాధించిన లాక్రోస్ గేమ్‌ను చీరాలలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల నుంచి 175 మంది క్రీడాకారులు, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో కలిపి 22 జట్లు శనివారం పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీలను లాక్రోస్ గేమ్ ఏపీ క్రీడా భారతి వైస్ ప్రెసిడెంట్ టి.జ్యోత్స్న తదితరులు పర్యవేక్షించారు.

ఏఎన్‌యూ రెజ్లింగ్ జట్టుకు కేబీఆర్ విద్యార్థులు



వర్సిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల రెజ్లింగ్(కుస్తీ) పోటీలో కేబీఆర్ కళాశాల విద్యార్థులు ఆరు బంగారు పతకాలు సాధించటంతో పాటు వర్సిటీ రెజ్లింగ్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.వి.నాగిరెడ్డి శనివారం తెలిపారు. వర్సిటీలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీలో తమ విద్యార్థులు ఓ నాగబ్రహ్మయ్య (55 కేజీలు), వై.మల్లికార్జున(60 కేజీలు), ఆర్.వీరాంజనేయులు(63 కేజీలు), ఎం.మహేష్ (72 కేజీలు), జి.ఇస్సాకు(77 కేజీలు), కె.ప్రభాకర్(82 కేజీలు) గ్రీకో–రోమన్ విభాగంలో బంగారు పతకాలు సాధించటంతో పాటు వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. చండీఘడ్‌లోని గురుకాశీ విశ్వవిద్యాలయంలో జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు ఏఎన్‌యు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్ తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటశివ అభినందించారు.

యువత సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి పి.రజిని
- యడ్లపాడులో బాసట ట్రస్ట్ ప్రారంభం



పుస్తకావిష్కరణ చేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి రజినీ, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

యడ్లపాడు: యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాల్సిన బాధ్యత ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి పి.రజిని పేర్కొన్నారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ బాసట ట్రస్ట్‌ను ఏర్పాటు చేశాయి. ఈ ట్రస్ట్‌ను మాజీ న్యాయమూర్తి రజిని, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు శనివారం ప్రారంభించారు. యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలం పరిధిలో సేవలందించిన రెండు సంస్థలు సేవల్ని మరింతగా విస్తృతం చేసేందుకు బాసట ట్రస్ట్‌గా ఏర్పడటం శుభపరిణామం అన్నారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ యడ్లపాడు మండలం అభ్యుదయ భావాలు కలిగిన గ్రామాలకు నెలవు అన్నారు. ట్రస్ట్ ఆశయాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. నూతలపాటి కాళిదాసు అధ్యక్ష వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు నంబూరి నరసింహారావు, ఆలోకం పెద్దబ్బాయ్య, పోపూరి గంగయ్యచౌదరి, అనంతలక్ష్మి, రమేష్‌బాబు, ముత్తవరపు రవీంద్రబాబు, పోపూరి శ్రీనివాసరావు, కేతా రామబ్రహ్మం, శ్రీనివాసరావు, చెరుకూరి సృజన, గోనుగుంట్ల కిరణ్‌కుమార్, చిట్టిపోతు రంగారావు, కోయ రామోజీరావు పాల్గొన్నారు.

రేషను డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ

తెనాలి: రాష్ట్రప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ ఈ నెల 3వ తేదీన జారీ చేసిన జీవో నెం.32 ప్రకారం తెనాలి డివిజనులోని ఎనిమిది మండలాల్లో నోటిఫికేషన్‌లో పేర్కొన్న చౌకధరల దుకాణాలకు డీలర్లను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. డివిజనులోని కాకుమాను, పొన్నూరు, తెనాలి, చేబ్రోలు, దుగ్గిరాల, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని చౌకధరల దుకాణాలను భర్తీ చేస్తామని తెలిపారు. వీటిలో వివిధ కారణాలతో ఖాళీ అయిన దుకాణాలు 81, కొత్తగా ఏర్పాటు చేసినవి 71 కలిపి మొత్తం 152 మంది రేషను డీలర్లను నియమించనున్నారు. నిర్దేశించిన నమూనాలో దరఖాస్తులను తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నేరుగా ఇవ్వొచ్చన్నారు. రిజిస్టరు పోస్టు ద్వారా కూడా పంపొచ్చని తెలిపారు. అభ్యర్థుల వయసు 18 – 40 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. కనీస విద్యార్హత ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. రాతపరీక్ష 80 మార్కులు, ఇంటర్వ్యూ 20 మార్కులకు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీలోగా వచ్చిన అర్జీల సంఖ్యను అనుసరించి 5వ తేదీన సంబంధిత అధికారి నిర్ణయించిన ప్రదేశంలో ఉదయం 9.30 గంటలకు రాతపరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష సమయం రెండు గంటలని, కేంద్రం, సమయం వివరాలను రెండురోజుల ముందు అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు ఒరిజినల్‌తో గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని వివరించారు. రాత పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థుల ఫలితాలను 1:5 నిష్పత్తిలో అదేరోజు సాయంత్రం ప్రకటిస్తారు. మరుసటిరోజు ఉదయం 10 గంటల్నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని పాదువు భవన్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని స్పష్టంగా తెలిపారు. సివిల్/క్రిమినల్ కేసులు నమోదై ఉండరాదని, స్థానిక ప్రజాప్రతినిధులు అర్హులు కాదనీ వివరించారు.

సంక్షేమం అనే పదానికి అర్థం చెప్పిన నేత వైఎస్ జగన్



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి

నెహ్రూనగర్: రాష్ట్రంలో సంక్షేమం అనే పదానికి అర్థం చెప్పిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చంద్రమౌళినగర్‌లో కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్ జగన్ పాలనలో పేద ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందించి వారికి అన్ని విధాలుగా అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవుతు వంశీరెడ్డి, శ్రీకాంత్, ఆళ్ల కౌశిక్, ఆళ్ల లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.